
నల్ల తుమ్మ దొంగలు


చెరువులో నరికి వేసిన పెద్ద నల్లతుమ్మ చెట్టు


కాటా వద్ద డంపింగ్ చేసి ఉన్న నల్లతుమ్మ దుంగలు

చిల్లకూరు: మండలంలోని ముత్యాల పాడు చెరువులో నల్ల తుమ్మ దొంగలు పడ్డారు. కూటమి నాయకులు ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టానుసారంగా తుమ్మ చెట్లు నరికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే, 25 ఏళ్ల క్రితం చెరువులో అటవీ, పంచాయతీ అధికారులు, ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నల్ల తుమ్మ మొక్కలను నాటారు. సుమారు 50 ఎకరాల్లో ఆ చెట్లు ఏపుగా పెరిగాయి. వీటికి అటవీ శాఖ గుర్తింపు కోసం నంబర్లను కేటాయించింది. తాజాగా అధికారం దక్కించుకున్న కూటమి నేతలు ఈ తుమ్మ చెట్లపై కన్నేశారు. మొదట జాతీయ రహదారి వెంబడి చెరువు అంచులో ఉన్న మూడెకరాల్లోని నల్లతుమ్మ చెట్లను నరికి విక్రయించారు. అయితే అధికారులకు ఫిర్యాదులు చేసినా వారు పట్టించుకోలేదు. ఇదే అదనుగా ఇప్పుడు లోతట్టు ప్రాంతంలోకి చొరబడ్డారు. పెద్ద పెద్ద చెట్లను నరికి తరలించే పనిలో పడ్డారు. ఇప్పటికే సుమారు 500 టన్నుల దుంగలను తరలించినట్లు సమాచారం. అయితే దీనిపై ఇరిగేషన్ శాఖాధికారులను సంప్రదిస్తే తమకు ఎలాంటి సమాచారం లేదని తప్పించుకోవడం విశేషం. ఇక గ్రామ పంచాయతీ కార్యదర్శి జోక్యం చేసుకోకుండా ఆయన్ను 15 రోజుల పాటు సెలవులో పంపించేశారు. మూడు నెలల క్రితం గూడూరు మండలం విందూరు చెరువులో నల్ల తుమ్మ చెట్లు నరికి వేస్తున్నారని అప్పటి డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణకు ఫిర్యాదు చేయగా చెట్లనరికి వేతను అడుకున్నారు. నేడు ముత్యాలపాడు చెరువులో నల్ల తుమ్మ చెట్లను అక్రమంగా నరికి తరలిస్తున్నారని ఇన్చార్జ్ డివిజనల్ పంచాయతీ అధికారిగా వ్యవహరిస్తున్న వాణిని వివరణ కోరగా తాను ప్రస్తుతం శిక్షణలో ఉన్నానని ఎంపీడీఓను పంపి విచారిస్తామని తెలిపారు. ఇదే విషయం ఇరిగేషన్ ఏఈ ఫరూఖ్ దృష్టికి తీసుకెళ్లగా ఇప్పటి వరకు తమకు ఎలాంటి సమాచారం లేదని చెప్పడం గమనార్హం.



క్లుప్తంగా

రూ.15 లక్షలు మట్టిపాలు


కంకర తేలిపోయిన రోడ్డు

చిట్టమూరు: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్లు వేసేందుకు నిధులు మంజూరు చేశారు. ఇందులో భాగంగా మండలంలోని ఎల్లసిరి చెరువు వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేక చొరవ తీసుకుని సుమారు 1.5 కిలోమీటర్ మెటల్ రోడ్డుకు రూ.15 లక్షలు మంజూరు చేయగా, కూటమి నాయకులు మెటల్ రోడ్డును వేశారు. గత నెలలో స్థానిక ప్రజా ప్రతినిధి ఈ రోడ్డును ప్రారంభించారు. అయితే నెల రోజులు కాకపోండే దుమ్ము లేసింది. దీంతో కంకర అంతా పైకి తేలి చెల్లా చెదురైపోయింది. ఫలితంగా ప్రయాణం నరక ప్రాయంగా మారింది. ప్రస్తుతం రోడ్డు పూర్తిగా ధ్వంసమైపోవడంతో రూ.15 లక్షలు నిధులు మట్టిలో పోసేసినట్లయింది.

నా పొలం సర్వే చేయండి


తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చిన వృద్ధురాలు

కలువాయి(సైదాపురం): పొలం సర్వే చేయండి అయ్యా అంటూ రెండు వారాలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా కనికరించడం లేదంటూ వృద్ధురాలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం వాపోయింది. ఆమె మాట్లాడుతూ మండలంలోని తెలుగు రాయపురానికి చెందిన ఈ మహిళకు నేషనల్ హైవే 67లో పక్కనే కొంత పొలం ఉందన్నారు. భర్త చనిపోవడంతో ఆ పొలం సర్వే చేయాలంటూ రెండు వారాల క్రితమే రెవెన్యూ అధికారులకు అర్జీ సమర్పించాను. వీఆర్‌ఓ బదిలీపై వెళ్లారంటూ సమాధానం ఇస్తున్నారన్నారు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి నా పొలానికి సరిహద్దు పెట్టి తన భూమిని తనకు అప్పగించాలని ఆ మహిళ వేడుకుంటోంది.

రాపూరు డిపోకు రెండు కొత్త సర్వీసులు


మొక్క నాటుతున్న ఆర్టీసీ అధికారులు

రాపూరు: స్థానిక ఆర్టీసీ డిపోకు రెండు కొత్త సర్వీసులను మంజూరు చేసినట్లు ఆర్టీసీ ఈడీఓ అప్పలరాజు, జోనల్ ఈడీ నాగేంద్రప్రసాద్ వెల్లడించారు. రాపూరు ఆర్టీసీ డిపోను సోమవారం సందర్శించి ఇక్కడ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ రాజంపేట-నెల్లూరు రెండు కొత్త సర్వీసులను నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మరో రెండు హైర్ బస్సులు కూడా రానున్నట్లు చెప్పారు. రాపూరు ఆర్టీసీ గ్యారేజ్ ముందు భాగంలో ఏర్పాటు చేసిన పార్కులో వారిద్దరూ మొక్కలు నాటారు. వారి వెంట సీటీఎంలు శ్రీనాథ్, రమేష్, డిపో మేనేజర్ అనిల్‌కుమార్, ఆర్టీసీ అధికారులు, కార్మికులు ఉన్నారు.

ఆక్రమిత భూముల్లో హెచ్చరిక బోర్డులు


ఆక్రమిత భూమిలో ఏర్పాటు చేసిన బోర్డు

దొరవారిసత్రం : మండలంలోని నెలబల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు-7లో ఉన్న ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో సోమవారం స్థానిక రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల కిందట స్థానిక గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఈ ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగుకు అనువుగా తీర్చుతున్న సమయంలో ఆర్ఐ నాగరాజు, వీఆర్వో రమేష్ ఘటన స్థలానికి వెళ్లి ఆక్రమణను అడ్డుకున్న విషయం తెలిసిందే. రెవెన్యూ అధికారులు ఆదేశాల మేరకు ఆక్రమణకు గురైన సుమారు 1.5 ఎకరాల భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని వీఆర్వో తెలియజేశారు.

కండలేరులో 27 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 27.010 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1975, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 70, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు		29.7.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	134
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	264
లేయర్ చికెన్	:	190

మాతా పరమేశ్వరి ఉత్సవాలు ఆరంభం

చిల్లకూరు: మండలంలోని కడివేడు గ్రామంలో వెలసిన మాతా పరమేశ్వరి అమ్మవారికి ఐదు రోజుల పాటుగా నిర్వహించే ఉత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ఆరంభమయ్యాయి. గ్రామానికి సమీపంలో ఉన్న శివాలయానికి దగ్గరలో కలశం ఏర్పాటు చేసి అక్కడి నుంచి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారి విగ్రహం తయారీ కోసం కావాల్సిన పుట్ట బంగారం(మట్టి) తీసుకు వచ్చేందుకు కడివేడు సమీపంలోని కలుజు వద్దకు చేరుకున్నారు. అక్కడ అమ్మవారి కథను వినిపించిన అనంతరం సోమవారం ఉదయం పుట్ట మట్టిని తీసుకుని అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకుని ఆలయం వద్దకు చేరుకున్నారు. సాయంత్రం పోతురాజు ముగ్గు వేసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


మాతా పరమేశ్వరి అమ్మవారి ఊరేగింపు

హైస్కూల్‌కు క్రీడా సామగ్రి

చిల్లకూరు : మండలంలోని పారిచెర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఆడుకోవడానికి అవసరమైన క్రీడా సామగ్రిని సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు గ్రంధం మాధవయ్యకు వాకర్స్ క్లబ్, జేవీవీ అధ్యక్షులు వేగూరు రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో అందజేశారు. దివిపాళెం, జెడ్పీ పాఠశాల పీడీ రమేష్, కానిస్టేబుల్ మస్తాన్ పాల్గొన్నారు.

ముగిసిన తిరునాళ్లు

ఓజిలి: మండల పరిధిలోని మనవాలి గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న మనవాలమ్మ గ్రామ దేవత తిరునాళ్లు సోమవారంతో ముగిశాయి. గ్రామస్తులు ఆలయం చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఉదయం అమ్మవారికి మహా అభిషేకం, అలంకారం, మహాకుంభం, అర్చనలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. మనవాలమ్మ అమ్మవారిని ఘనంగా ఊరేగించారు.

ప్రారంభమైన పోలేరమ్మ పరమేశ్వరి ఉత్సవాలు


పోలేరమ్మ పరమేశ్వరి మాను వద్ద సామూహిక కుంకుమార్చన పూజలు చేస్తున్న భక్తులు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని లోతువానిగుంట కాలనీలో పోలేరమ్మ పరమేశ్వరి ఉత్సవాలను సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభించారు. పోలేరమ్మ మానువద్ద గ్రామదేవతకు పూజలు చేశారు. అనంతరం విఘ్నేశ్వర పూజ, రాత్రి పోలేరమ్మ మానువద్ద, మహిళలతో సహస్ర కుంకుమార్చన పూజలను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో స్థానిక నాయకులు వినుకొండ ధనుంజయ్య, శివ, కాలనీ యువత పాల్గొన్నారు.

రీ సర్వేతో ఇబ్బందులు

చిల్లకూరు: ఇటీవల జరిగిన రీ సర్వేలో జరిగిన తప్పుల వల్ల 20 కుటుంబాల వారు ఇబ్బంది పడుతున్నారని మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో జేసీ శుభం బన్సల్‌ను కలిసి వినతి పత్రం అందించారు. దీనిపై జేసీ స్పందించి త్వరలోనే పరిశీలించి చర్యలు చేపడతామని అన్నారు.

దోమలను నిర్మూలించండి

దక్కిలి: స్థానిక గ్రామ పంచాయితీలో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని దోమల నివారణపై అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికుడు మురళి ఎంపీడీఓకు సోమవారం విన్నవించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా దోమలు వ్యాప్తి పెరుగుతోందని చెప్పారు. ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశమున్నందున, త్వరగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఎర్రజెండా ఎల్లప్పుడూ ప్రజాపక్షమే

వెంకటగిరి రూరల్ : సమస్యలు ఎదుర్కొంటున్న పేద ప్రజల పక్షాన ఎర్రజెండా ఎప్పుడూ తోడుగా ఉంటుందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె రాధాకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని వసంత కృష్ణ కల్యాణ మండపంలో సీపీఐ వెంకటగిరి నియోజకవర్గ సహాసభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దోపిడీ వ్యవస్థ ఉన్నంత వరకు కమ్యూనిస్టు పార్టీ ప్రజలకు అండగా ఉంటుందన్నారు. వర్కింగ్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పల్లిపాటి బాలకృష్ణ పాల్గొన్నారు.

తొలగించిన నిమ్మచెట్ల పరిశీలన

సైదాపురం: మండలంలోని కమ్మువారిపల్లెలో గిరిజనులు, దళితులు సాగు చేసుకుంటున్న నిమ్మచెట్లను తొలగించిన ప్రాంతాన్ని సీపీఎం బృందం ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్ మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన వ్యక్తి పల్లెటి వెంకటేశ్వర్లు అధికారులపై ఒత్తిడి తెచ్చి గిరిజనులు, దళితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం రైతులతో కలసి వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసులు, రైతులు వెంకటయ్య, బాలు, రమణమ్మ, కృష్ణమ్మ, శివయ్య, శ్రీనివాసులు, మస్తానయ్య పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న కార్మికులు

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి

భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి. ఐఎఫ్‌టీయూ జిల్లా గౌరవాధ్యక్షులు డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఎర్రజెండాలతో బైక్ ర్యాలీ చేశారు. అనంతరం బస్టాండ్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. పోలయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. మండల కేంద్రంలోని 883 సర్వేనంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని కార్మికులకు ఇళ్ల స్థలాలుగా పట్టాలను ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చెంగల్‌రావు, శ్రీనివాసులు, నవకోటి, అనిల్, వెంకటరమణయ్య, శ్రీనివాసులు, పోలయ్య, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

గాంధీజీ విగ్రహ ధ్వంసంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నాయుడుపేటటౌన్: మండలంలోని పుదూరులో ఉన్న గాంధీజీ విగ్రహాన్ని అక్కడి టీడీపీ నాయకులు ధ్వంసం చేయడంపై గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సుమారు 60 ఏళ్లుగా ఉన్న గాంధీజీ విగ్రహాన్ని జేసీబీతో ధ్వంసం చేసిన తీరును వివరించారు. ధ్వంసం చేసిన గ్రామానికి చెందిన అల్లెకుల మనోజ్‌పై కఠిన చర్యలు చేపట్టాలని పోలీసులు, ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు విన్నవించారు. దీంతో కలెక్టర్ వెంటనే స్పందించి గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదును జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు పంపించారు. దీనిపై దర్యాప్తు చేపట్టి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామస్తులు మరి కొంతమంది మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీఓ సురేష్ బాబుకు మరోసారి వినతి పత్రాన్ని అందించారు.


ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

విధుల్లో చేరిన తోపుగుంట వీఆర్వో

సాక్షి ఎఫెక్ట్..

కలువాయి(సైదాపురం) : మండలంలోని తోపుగుంట సచివాలయం వీఆర్వోగా సోమవారం వంశీప్రదీప్ విధుల్లో చేరారు. వంశీ ప్రదీప్ బదిలీ ఉత్తర్వులను తహసీల్దార్ శ్యాంసుందర్ లెక్కచేయని వైనంపై ఈ నెల 21వ తేదీన బదిలీ ఉత్తర్వులు బేఖాతర్ శీర్షిక ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ కథనానికి స్పందించిన జిల్లా కలెక్టర్ ఆనంద్ తహసీల్దార్‌కు కాల్ చేసి వెంటనే తోపుకుంట వీఆర్వోను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తప్పనిపరిస్థితుల్లో తోపుగుంటలో ప్రస్తుతం పనిచేస్తున్న వీఆర్వోను రిలీవ్ చేసి వంశీ ప్రదీప్‌ను విధుల్లో చేర్చుకున్నారు.


జాయినింగ్ రిపోర్ట్ అందజేస్తున్న వీఆర్వో

డీవీ సత్రంలో గ్రీవెన్స్ డే

దొరవారిసత్రం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించగా భూ సమస్యలపై పలు గ్రామాల నుంచి అధికారులకు అర్జీలు అందాయి. అధికంగా పట్టాదారు పాసు పుస్తకాలు, 1బీ, అడంగల్లలో పేర్ల మార్పులు తదితర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీఓ గోవర్ధన, ఏఈ మోహన్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


నిత్యాన్న పథకానికి విరాళం ఇస్తున్న దాతలు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఉన్న శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి నిత్యాన్నదాన పథకానికి సోమవారం రైల్వే కోడూరుకు చెందిన నాలబాల ఆనంద్‌కుమార్ కుటుంబసభ్యులు, రూ.1.18 లక్షలు నగదు రూపంలో దేవస్థాన సిబ్బందికి అందించినట్లు అధికారులు తెలిపారు. దాతలకు మూడు ఆలయాల్లో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

జగనన్న కాలనీ ప్లాట్‌ల వివరాల కోసం వినతి

వెంకటగిరి రూరల్: పట్టణంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇంటిస్థలాల వివరాలు తెలియజేయాలంటూ ఆర్టీఐ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు ఆరి శంకరయ్య హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం సుదర్శన్ నగర్ సచివాలయంలో ప్రజల వద్ద ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరించారు.

ఫ్లైఓవర్ నిర్మాణం త్వరగా చేపట్టండి

చిల్లకూరు: గూడూరు ఒకటి, రెండవ పట్టణాలను కలిపేలా 22 ఏళ్ల క్రితం చేపట్టిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి అసంపూర్తిగా నిలిచి పోయి ఉందని దీనిని త్వరగా పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాను సోమవారం బీజేవైఎం అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్‌కుమార్ కోరారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినంలో భాగంగా ఆయన సబ్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఆయన వెంట బీజేవైఎం నాయకులు కిరణ్, నవీన్, మహేష్, ప్రసాద్, చైతన్య, వసంత్ పాల్గొన్నారు.

పీఈటీపై చర్యలు తీసుకోవాలి

వెంకటగిరి రూరల్ : కోట ఎస్సీ హాస్టల్ విద్యార్థినులు యూనిఫాంలో హాజరుకాకపోవడంతో వారితో గుంజీలు తీయించిన వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాను(మాబాషా)పై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రజా సంఘా ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. విద్యార్థినులను 100 గుంజీలు తీయించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. దీనిపై ఉన్నత అధికారులు దృష్టిసారించి తగుచర్యలు తీసుకోవాలని సూచించారు.

యువతి ఆత్మహత్య

తడ: అనారోగ్యంతో శ్రీకాకుళం జిల్లా, నందిగం మండలం, గొల్లవూరు గ్రామానికి చెందిన జీరు పూజిత(21) అనే యువతి ఆదివారం రాత్రి తన గదిలో ఉరి వేసుకుని మృతి చెందింది. ఎస్ఐ కొడపనాయుడు కథనం మేరకు.. శ్రీసిటీలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేసే పూజిత తడకండ్రిగలోని ఓ అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్ గదిలో అద్దెకు నివసిస్తోంది. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో ఆమెను అదే పరిశ్రమలో పని చేసే ఆనంద్ కృష్ణన్ అనే మిత్రుడు తరచూ పరామర్శిస్తుండేవాడు. ఈ క్రమంలో చనిపోయిన రోజు కూడా ఆనంద్ కృష్ణన్ ఆమెను ఉదయం పలకరించి వెళ్లాడు. సాయంత్రం వచ్చిన అతను పూజిత గదిలో సీలింగ్ ఫ్యాన్‌కి చున్నీతో ఉరి వేసుకుని ఉన్నట్టు గమనించి, అదే అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న మరో వ్యక్తి సాయంతో తలుపులు పగుల కొట్టి ఆమెను కిందకు దించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఎస్ఐ మృతురాలి తండ్రి శ్రీనివాసరావుకు సమాచారం ఇవ్వడంతో సోమవారం తడకు వచ్చిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొడపనాయుడు తెలిపారు.

బురదగుంటలా.. రోడ్లా.?

చిట్టమూరు: మండలంలో చిరు జల్లులు కురిసినా రోడ్లన్నీ బురదగుంటలుగా మారిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లకు మరమ్మతులు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేస్తామని గొప్పలు చెప్పుకుంది. అయితే అది ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. హామీలు క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లపై గుంతల్లో నీరు చేరడంతో వాహన దారులు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు వేశారు గానీ వాటికి పక్కన కాలువలు నిర్మించకపోవడంతో రోడ్డుపై వర్షపు నీరు నిల్వ చేరి బురదగుంటలుగా మారిపోతున్నాయి.

గుంతల రోడ్డుతో నరకయాతన

ఓజిలి: ఓజిలి నుంచి కురుగొండ గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వాన్నంగా తయారైంది. వాహనాలు ప్రయాణించేందుకు వీలు లేకుండా రహదారిపై మోకాటిలోతు గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో మానమాల, బత్తలాపురం, చిట్టమూరు మండలం గునపాటు, కోట, వాకాడు పట్టణాలకు నిత్యం వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షం వస్తే గుంతలలో నీరు నిలిచి వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.


గ్రామాల నుంచి చిట్టమూరుకు వెళ్లే రోడ్డు దుస్థితి




చిట్టమూరు: ఆరూరు గ్రామంలో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు, కొత్తగుంట గ్రామంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు, ఓజిలి సమీపంలో రహదారిపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు